క్లుప్తంగా

నిందితులను కఠినంగా శిక్షించాలి

భూపాలపల్లి రూరల్: మండలంలోని నేరేడుపల్లిలో నీలగిరి తోటకు నిప్పుపెట్టి కాల్చివేసిన వారిని కఠినంగా శిక్షించాలని గ్రామానికి చెందిన రైతు ముద్దసాని కిరణ్ బుధవారం భూపాలపల్లి పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశాడు. తనకు సంబంధించిన భూమిలో ఉన్న నీలగిరి తోటకు బుధవారం నిప్పు పెట్టారని, దీంతో తోటతో పాటు, బోరు మోటారు మంటల్లో కాలి బూడిదయ్యాయన్నారు. సుమారుగా రూ. 4 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందన్నారు. నిందితులను గుర్తించి తనకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

సమ్మె నోటీసు



డీటీకి సమ్మె నోటీసు ఇస్తున్న వీఓఏలు

మహాముత్తారం: ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, అలాగే రూ.26వేల కనీస వేతనాలు చెల్లించి రూ.10 లక్షల సాధారణ ఆరోగ్యబీమా కల్పించాలని కోరుతూ బుధవారం వీఓఏల సంఘం ఆధ్వర్యంలో ఐకేపీ ఏపీఎం, డిప్యూటీ తహసీల్దార్‌కు సమ్మె నోటీసు ఇచ్చారు. వీఓఏల సంఘం నాయకులు సకినాల మల్లయ్య, తొట్ల రాజేష్, గోస్కుల సత్యం, మేడ మల్లేష్, మాడవత్ రాజన్న, మిర్జా నజ్మబేగం, పుశ్పలత తదితరులు ఉన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడుపొద్దు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై

టేకుమట్ల(రేగొండ): మద్యం సేవించి వాహనాలను నడుపొద్దని, ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రేగొండ మండలంలోని లింగాల క్రాస్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, వాహన పత్రాలను పరిశీలించారు. వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించి పలువురికి జరిమాన విధించారు. రోడ్డు ప్రమాదాల వల్ల శారీరకంగా, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతారన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి

పలిమెల : మండలంలోని మోడేడులో నూతనంగా నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న నర్సరీని సందర్శించి కలుపు లేకుండా చూసుకోవాలని వాచర్‌కి సూచించారు. ఆయన వెంట మండల ఆఫీస్ సిబ్బంది సురేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీరామ్, తదితరులు ఉన్నారు.

మరమ్మతు చేసినా.. బారికేడ్ తీయలేదు



మరమ్మతు చేసినా తొలగించని బారికేడు

కాళేశ్వరం: కాళేశ్వరం వద్ద గోదావరిపై నిర్మించిన అంతరాష్ట్ర వంతెనపై గోతులకు మరమ్మతులు చేసినా బారికేడ్ బోర్డు మాత్రం తీయడం లేదని విమర్శలు వస్తున్నాయి. గత కొన్ని రోజులుగా వంతెనపై అక్కడక్కడా గోతులు ఏర్పడి రాప్టర్లు బయటికి తేలి ప్రమాదకరంగా మారాయి. దీంతో అధికారులు బారికేడులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఎన్‌హెచ్ ఇంజనీరింగ్ అధికారులు గోతులకు మరమ్మతు చేశారు. కానీ బారికేడ్ బోర్డు తొలగించకపోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహన చోదకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి బారికేడ్ తొలగించాలని కోరుతున్నారు.

కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి



చిట్యాల : ఎంపీపీ, జెడ్పీటీసీలకు స్వీట్లు పంచుతున్న పంచాయతీ కార్యదర్శులు

చిట్యాల: నాలుగేళ్లుగా మండలంలోని అన్ని గ్రామాల్లో జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా పని చేస్తున్నామని తమను రెగ్యులరైజ్ చేసి పదోన్నతి కల్పించాలని ఎంపీపీ దావు వినోద, జెడ్పీటీసీ గొర్రె సాగర్, ఎంపీడీఓ రామయ్యలకు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. అనంతరం నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వీట్లు పంచారు. కార్యక్రమంలో ఎంపీఓ రామకృష్ణ, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబెషనరీ పీరియడ్ నాలుగేళ్లు పూర్తయిన కేక్ కట్ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీపీ యార సుజాత సంజీవరెడ్డి, జెడ్పీటీసీ జోరుక సదయ్యలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీఓ వినోద్‌కుమార్, సర్పంచ్ మోటె ధర్మారావు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహాముత్తారం: ఎంపీడీఓ కార్యాలయంలో మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ, సూపరింటిండెంట్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రొబెషనరీ కాలాన్ని సర్వీస్‌గా పరిగణించాలి

కాటారం: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబెషనరీ కాలాన్ని సర్వీసుగా పరిగణించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీడీఓ శంకర్‌నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. అంతకముందు జేపీఎస్‌లు నియామకమై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో ఎంపీఓ ఉపేంద్రయ్య, కోఆప్షన్ సభ్యుడు అజీజ్, పంచాయతీ కార్యదర్శులు బీరెల్లి కరుణాకర్, షగీర్ ఖాన్, శేఖర్, రజిత, రవి, తదితరులు పాల్గొన్నారు.



మొగుళ్లపల్లిలో..



మహాముత్తారంలో..



కాటారం : ఎంపీపీ, ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు



కాటారం : లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు



లబ్ధిదారులను ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

కాటారం: మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి యూనిట్ల రుణాల మంజూరు కోసం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలో రెండు యూనిట్లకు సంబంధించి 65 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా 55 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఎంపీడీఓ, బ్యాంక్ అధికారులు లబ్ధిదారుల అర్హత ధృవీకరణ పత్రాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ ఉపేంద్రయ్య, ఎస్బీఐ, కేడీసీసీ, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూ..

పలిమెల: మైనార్టీ రుణాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కురసం బుచ్చక్క, తహసీల్దార్ ప్రవంతి, ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి, బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఒక యూనిట్‌కు గాను ఎనిమిది మందిని ఇంటర్వ్యూ చేసినట్లు వారు తెలిపారు.

ఉపాధి పనులపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రకాశ్‌రెడి

పలిమెల : మండల పరిధిలో ఉపాధి హామీ పనులు, నర్సరీల నిర్వహణపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి కనీసం 200 మంది కూలీలు హాజరయ్యేలా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను పరిశీలించి త్వరగా డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీల్లో ఖాళీ బ్యాగుల్లో గింజలు నాటాలన్నారు. కార్యక్రమంలో ఈసీ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శులు మదన్, శ్రీధర్, పీటర్ పాల్, రామ్, సల్మాన్ పాల్గొన్నారు.

బైక్‌ను దహనం చేసిన దుండగులు



పూర్తిగా కాలిపోయిన బైక్

కాటారం: మండలంలోని రేగులగూడెం పరిధిలోని బస్టాండ్ సమీపం ఎస్సీ కాలనీలో గుర్తుతెలియని దుండగులు కోడిపల్లి విష్ణువర్ధన్‌కు చెందిన బైక్‌ను మంగళవారం అర్ధరాత్రి దహనం చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. విష్ణువర్ధన్ భార్యను తీసుకొని సాయంత్రం అత్తగారింటికి వచ్చి బైక్‌ను ఇంటి ముందు నిలిపి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించాను. అర్ధరాత్రి భారీ శబ్దం రావడంతో కుటుంబ సభ్యులు తలుపులు తీసి బయటకు వచ్చి చూడగా బైక్ మంటల్లో కాలిపోయిందని తెలిపాడు. సమయానికి గమనించకపోతే మంటలు ఇంటికి అంటుకొని కుటుంబ సభ్యులమంతా అగ్నికి ఆహుతయ్యే వాళ్లమని విష్ణువర్ధన్, కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నరేందర్‌కు ఘనసన్మానం



నరేందర్‌ను సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు

చిట్యాల: తెలంగాణ రాష్ట్ర చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కట్కూరి నరేందర్‌ను చిట్యాల పద్మశాలీ వీవర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం మండలకేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఆ సంఘం అధ్యక్షుడు ఈగ కోటేశ్వర్, సంఘ సభ్యులు ఆయనను శాలువాలు, పూలమాలలతో సత్కరించి మిఠాయిలు తినిపించారు. నరేందర్ భవిష్యత్తులో ఇలాంటి పదవులు మరిన్ని అలంకరించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చింతకింది శ్రీనివాస్, కోశాధికారి సామల రాజేందర్, సామల రమేష్, నాగుల రమేష్, కందుల రమేష్, చింతకింది దశరథం, కొండబత్తుల రాజేందర్, చిప్ప విశ్వనాథం,సుధాకర్, శ్రీనివాస్, యాదగిరి, మహేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో కవి సమ్మేళనం



కవులను సన్మానిస్తున్న బుర్ర రమేష్

భూపాలపల్లి అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో బుధవారం కవి సమ్మేళనం నిర్వహించారు. జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన కవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్ హాజరైన కవులను సన్మానించారు. నిరుద్యోగులు, యువకులు పుస్తకపఠన అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కవులు సంజీవరావు, మొగిలి, రమేష్, గ్రంథ పాలకులు చంద్రమౌళి, శారద, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల గ్రామంలో డాక్టర్.బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ గురువారం ఉదయం 11 గంటలకు చేయనున్నట్లు సర్పంచ్ మానెం లస్మయ్య, ఎంపీటీసీ మంచినీళ్ల దుర్గయ్య బుధవారం తెలిపారు. కార్యక్రమానికి పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్‌లు పుట్ట మధుకర్, జక్కు శ్రీహర్షిణి ముఖ్య అతిథులుగా రానున్నారు.

నూతన విద్యావిధానం రద్దు చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న రమేష్‌రాథోడ్

భూపాలపల్లి అర్బన్: నూతన జాతీయ విద్యావిధానంతో దేశం తిరోగమనం వైపు వెళ్తుందని వెంటనే దానిని రద్దు చేయాలని అఖిల భారత విద్యాహక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షవర్గ సభ్యులు రమేష్ పట్నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆవరణంలో బుధవారం జిల్లా స్థాయి విద్యా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న విద్యావిధానంలో అనేక లోపాలు ఉన్నాయని విమర్శలు వస్తున్న తరుణంలో ఇక్కడి పాలకవర్గాలు ఎన్ఈపీ–2020ని అమలు చేయడంతో దేశ భవిష్యత్ తిరోగమనంలోకి వెళ్లిపోవడమే కాకుండా అనేక రకాల సంక్షోభాలకు కారణం అవుతుందన్నారు. విద్యారంగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు, పరోక్షంగా ఉచిత నిర్బంధ విద్యాహక్కును తొలగించడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ప్రవీణ్‌కుమార్, భోగేశ్వర్, సేవానాయక్, తిరుపతి, కర్ణాకర్, రాజమల్లయ్య, రమణరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే గండ్ర రాక

చిట్యాల: మండల కేంద్రంలోని రైతు వేదికలో లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేసేందుకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి రానున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఆరెపల్లి మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కాటారం: మండలంలోని రేగులగూడెం సమీపంలో కాటారం–మంథని ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని విలాసాగర్‌కు చెందిన అస్లాం, రాజు కాటారం నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తున్నారు. మంథని వైపు నుంచి కాటారం వెళ్తున్న కారు బైక్‌ను బలంగా ఢీ కొట్టడంతో బైక్‌పై నుంచి అస్లాం, రాజు ఎగిరి రోడ్డుపై పడ్డారు. అస్లాం, రాజులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన కారు సంఘటనా స్థలంలో ఆపకుండా వెళ్లిపోయింది. స్థానికులు 108 ద్వారా క్షతగాత్రులను మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు



ఎస్సై శ్రీకాంత్‌రెడ్డికి విరాళం అందజేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

టేకుమట్ల: గ్రామాల్లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై శ్రీకాంత్ రెడ్డి కోరారు. బుధవారం రేగొండ మండలంలోని గోరికొత్తపల్లిలో మేము సైతంలో భాగంగా సీసీ కెమెరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లోని కూడళ్లలో, రద్దీ ప్రాంతంలో, గ్రామప్రారంభం, చివరలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎవరైనా అనుమానిత వ్యక్తులు గ్రామంలోని వచ్చి అసాంఘిక కార్యక్రమాలు, చోరీలకు పాల్పడే వ్యక్తులను సులభంగా గుర్తించవచ్చని అన్నారు. అలాగే వ్యాపారులు తప్పని సరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలో త్వరలోనే అందరి సహకారంతో పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నేర రహిత మండలంగా మార్చుకుందామని అన్నారు. అనంతరం సీసీ కెమెరాల ఏర్పాటు కోసం స్థానిక సర్పంచ్ సుదబోయిన రజితరాజు, ఎంపీటీసీ హమీద్‌లు విరాళాన్ని ఎస్సైకి అందించారు. దాంతో గ్రామస్తులు, వ్యాపారులు. ట్రాక్టర్ ఓనర్లు అందించిన విరాళాల మొత్తం రూ. 99వేలను సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీ, వ్యాపారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



స్వరూపకు ఆర్థికసాయం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు



కృష్ణ చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న కీర్తిరెడ్డి

మల్హర్: ఇటీవల మండలంలోని మల్లారం, చిన్నతూండ్ల గ్రామానికి చెందిన పదో తరగతి పరీక్షలు రాసి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఆటో బోల్తాపడి విద్యార్థులకు గాయాలైన విషయం విధితమే. ఈమేరకు ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ సభ్యులు గాయపడిన విద్యార్థులను బుధవారం పరామర్శించి పండ్లు, ఆర్థికసాయాన్ని అందించారు. అలాగే భూపాలపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్వరూపను అక్కడికి వెళ్లి పరామర్శించి రూ. 5వేలు అందించారు.

ర్థికసాయం

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని రామన్నగూడెంతండాకు చెందిన బానోతు కృష్ణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం ఆయన కుటుంబ సభ్యులను బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆమె వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడునూతుల నిశీధర్‌రెడ్డి, నాయకులు మోహన్‌నాయక్, రాజేందర్, ఉన్నారు.

‘నిరుద్యోగ మార్చ్’ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న భగవాన్

భూపాలపల్లి రూరల్ : హనుమకొండలో ఈనెల 15న నిర్వహించే నిరుద్యోగ మార్చ్‌లో జిల్లా నుంచి నిరుద్యోగులు, ప్రజలు అధికంగా హాజరై విజయవంతం చేయాలని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి భగవాన్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిర్వహించే ప్రశ్నపత్రాలు లీకేజీ చేస్తూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడుగుర్రం రమేష్, సంఘం నాయకులు కిరణ్, రాజ్‌కుమార్, సందీప్, రాజు, సురేష్, మహేష్, పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలి



కలెక్టర్ భవేష్ మిశ్రాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీపీయూఎస్ నాయకులు

భూపాలపల్లి/భూపాలపల్లి రూరల్: తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం(టీపీయూఎస్) కార్యాలయ భవన నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలం కేటాయించాలని ఆ సంఘం నాయకులు బుధవారం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాకు వినతిపత్రం సమర్పించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించిన అనంతరం ఆఫీస్ భవనం, కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం నాయకులు కొలిపాక శ్రీనివాస్, శ్రీధర్, సతీష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

చెరువులు చేపల వేటలో తమకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని గంగపుత్ర సంఘం నాయకులు బుధవారం కలెక్టర్ భవేష్ మిశ్రాను కోరారు. సంఘం నాయకులు భువనసుందర్, టంగుటూరి రాజేష్, చెగ్గం శ్రీనివాస్ ఉన్నారు.

బస్‌పాస్‌ల పంపిణీకి ప్రత్యేక శిబిరం ఏర్పాటు

కాటారం: దివ్యాంగులకు ఆర్టీసీ బస్‌పాస్ పంపిణీ కోసం మండల కేంద్రానికి సమీపంలోని మంథని, మహదేవపూర్ వైపు ఆర్టీసీ బస్టాండ్‌ల వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు భూపాలపల్లి డిపో మేనేజర్ ప్రతిమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు బస్‌పాస్‌లకు సంబంధించిన ప్రత్యేక శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. సదరం సర్టిఫికెట్ కల్గిన దివ్యాంగులు భూపాలపల్లికి రాకుండా ఈ శిబిరం ద్వారా బస్‌పాస్‌లు పొందే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సదరం సర్టిఫికెట్లు పొంది బస్‌పాస్‌లు తీసుకోని దివ్యాంగులు మండలంలో 410 మంది ఉన్నారన్నారు. వారు సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

విరబూసిన కలువ పూలు



కాళేశ్వరం: ఎండలు మండిపోతున్నాయి. సూర్యుడి వేడికి చెరువులు, వాగులు, బావులు వట్టిపోతున్నాయి. కానీ మహదేవపూర్ మండలం కాళేశ్వరాలయం సమీపంలోని గుండం చెరువు నీటిలో కలువ పూలు తేలియాడుతూ భక్తులు, సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. భక్తులంతా కలువ పూల అందం చూడతరమా అంటూ ఎంజాయ్ చేస్తున్నాయి.